# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

TS వైబ్రెంట్ ఎడిషన్ 4 pm

teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

సోమవారం 31-7-2023


## ఐదుగురు దుర్మరణం

### మృతుల్లో నలుగురు చిన్నారులే..

### ఒడిశాలో కల్వర్టు కూలడంతో ఘటన

**ఒడిశా, జూలై 31 (తెలుగుప్రభ)**

ఒడిశాలో ఘోర ప్రమాదం జరిగింది. నిర్మాణంలో ఉన్న కల్వర్టు కూలి ఐదుగురు మృతి చెందారు. మృతుల్లో నలుగురు చిన్నారులు ఉన్నారు. రాయగడ జిల్లాలోని ఉపరసజ గ్రామ సమీపంలో ఓ కల్వర్టు నిర్మిస్తున్నారు. అయితే సోమవారం ఉదయం కొంత మంది పిల్లలు స్నానాలు చేసేందుకు ఆ కల్వర్టు వద్దకు వెళ్లారు. పిల్లలు స్నానాలు చేస్తుండగా, ప్రమాదవశాత్తు కల్వర్టు కుప్పకూలిపోయింది. మొత్తం ఐదుగురు మృతి చెందారు. మృతుల్లో నలుగురు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. శిథిలాల కింద ఉన్న మృతదేహాలను పోలీసులు వెలికితీశారు. మృతుల నివాసాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.



## వికటించిన స్టంట్

### 68వ అంతస్తు నుంచి పడి మృతి

### సీసీ ఫుటేజీ వైరల్

**న్యూఢిల్లీ, జూలై 31 (తెలుగుప్రభ)**

ఆకాశహర్మ్యం మీద స్టంట్ చేస్తూ 68వ అంతస్తు నుండి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎంతో ఉత్సాహంగా స్టంట్స్ చేస్తుండగా అంతలోనే విషాదం నెలకొంది. ఆకాశహర్మ్యాలపై విన్యాసాలు చేయడంలో పేరుగాంచిన ఫ్రెంచ్ డేర్‌డెవిల్ రెమీ లూసిడి హాంకాంగ్‌లోని ఎత్తైన భవనంపై నుండి పడి మరణించాడు. స్టంట్ చేయాలనే ఉద్దేశ్యంతో రెమీ లూసిడి భవనంలోకి ప్రవేశించాడని, అయితే పెంట్ హౌస్ లో చిక్కుకుపోయాడని భావిస్తున్నారు. ఈ క్రమంలో కాలు జారి 68వ అంతస్తు నుంచి కిందపడ్డాడు. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్‌లోని ఒక నివేదిక ప్రకారం 30 ఏళ్ల వ్యక్తి రెమీ లూసిడి స్టంట్‌ను అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నప్పుడు ట్రాంగుంటర్ టవర్ కాంప్లెక్స్ లోని పెంట్ హౌస్ బయట చిక్కుకున్నాడు. అప్పుడు ప్రాణాపాయం భయంతో రెమీ లూసిడి చేతులతో కిటికీ తలపులు కొట్టడం ప్రారంభించాడు. ఈ విషయాన్ని లోపల ఉన్న మనిషి చూసి ఆశ్చర్యపడ్డాడు. ఇంతలో లూసిడి తనపై తాను నియంత్రణ కోల్పోయి కింద పడిపోయాడు. ఇది ఆయన అభిమానులకు ఇది చేదువార్తగా మారింది. సీసీ ఫుటేజీలో లూసిడి ట్రెగుంటర్ టవర్ కాంప్లెక్స్ పైకి నిచ్చెన ఎక్కుతున్నట్లు కనిపించింది. ప్రస్తుతం ఈ విషయమై పోలీసులు విచారణ జరుపుతున్నారు. సంఘటన స్థలంలో ఉన్న లూసిడ్ కెమెరాను కనుగొన్నారు. డేర్‌డెవిల్ ఆకాశహర్మ్యాలపై అనేక అద్భుతమైన స్టంట్ వీడియోలు చేయబడ్డాయి.



## డిప్యూటీ సీఎం డీకేకు ఊరట

**న్యూఢిల్లీ, జూలై31(తెలుగుప్రభ):**

కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. కర్నాటక హైకోర్టు ఉత్తర్వులపై జోక్యం కల్పించుకోమని స్పష్టం చేసింది. అవినీతి కేసుకు సంబంధించి సీబీఐ దర్యాప్తుపై గతంలో కర్నాటక హైకోర్టు స్టే ఇచ్చింది. హైకోర్టు స్టే ఉత్తర్వులపై సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ అంశంపై ఇవాళ విచారణ జరిపిన జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ సీటీ రవికుమార్, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఈఅంశం హైకోర్టు డివిజన్ బెంచ్‌వద్ద పెండింగ్‌లో ఉన్నంతున తాము జోక్యం చేసుకోలేమని తెలిపింది. ఈ కేసును త్వరగా పరిష్కరించాల్సిందిగా హైకోర్టును కోరేందుకు సీబీఐకి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్లు పేర్కొంది.



## బీజేపీ ఎంపీకి నిరసన సెగ

### సొంత పార్టీ కార్యకర్తల నుంచే..

**హైదరాబాద్, జూలై 31 (తెలుగుప్రభ)**

కిషన్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి.. బండి సంజయ్ నాయకత్వం వర్ధిల్లాలి.. అరవింద్ డౌన్ డౌన్.. అంటూ బీజేపీ కార్యాలయం నినాదాలతో హోరెత్తింది. పార్టీ కార్యాలయంలోనే నినాదాలతో అగ్ర నాయకత్వం అట్టుడుకుతోంది. విషయం ఏంటంటే.. నిజామాబాద్ బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఎంపీ ధర్మపురి అరవింద్ కు వ్యతిరేకంగా బీజేపీ కార్యాలయ ముట్టడికి బీజేపీ కార్యకర్తలు ముట్టడించారు. 13 మండలాల అధ్యక్షులను మార్చడంపై నిరసన వ్యక్తం చేశారు. ఎంపీ అర్వింద్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు.





## 67 మంది డీఎస్పీలకు పోస్టింగ్

**హైదరాబాద్, జూలై 31 (తెలుగుప్రభ)**

ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలోని పలు శాఖల్లో బదిలీల పర్వం కొనసాగుతోంది. పోలీసు శాఖలో మరింత జోరుగా జరుగుతున్నాయి. ఆదివారమే 163 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేసిన ఆ శాఖ తాజాగా డీఎస్పీలకు పోస్టింగ్‌లు ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా 67 మంది డీఎస్పీలకు పోలింగ్‌లు ఇస్తూ డీజీపీ అంజనీ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కుల్సుంపుర ఏసీపీగా అబ్దుల్ జావిద్, మీర్ చైక్ ఏసీపీగా ఉమా మహేశ్వర్ రావు, వర్ధన్నపేట ఏసీపీగా వీ సురేశ్, వరంగల్ సీసీఆర్బీ ఏసీపీగా గజ్జి కృష్ణ, టీఎస్ జెన్‌కో ఏసీపీగా తిరుపతి యాదవ్, సీసీఎస్ ఏసీపీగా శంకర్ రెడ్డిని నియమించారు.

## వెనక్కు మళ్లిన విమానం

న్యూఢిల్లీ (తెలుగుప్రభ): ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ నుంచి ఢిల్లీకి బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన గంటకే తిరిగి మెల్‌బోర్న్‌కు వెనక్కు వెళ్లింది. విమానం బయల్దేరాక గంట సేపటికి ప్రయాణికుడొకరు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో అదే విమానంలో ప్రయాణిస్తున్న డాక్టరొకరు పరీక్షించారు. అత్యవసరంగా చికిత్స జరగాలని స్పష్టం చేయడంతో విమానం వెనక్కు మళ్లింది. దీంతో విమానం ఆలస్యమై నిన్న రాత్రి ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది.



## విమానాశ్రయంలో 47 కొండచిలువలు ?

**చెన్నయ్, జూలై31(తెలుగుప్రభ):**

విమానాశ్రయంలో కొండ చిలువలేమిటని అనుకుంటున్నారా ! అయితే వాటంతటవే రాలేదు. మలేసియాలోని కౌలాలంపూర్‌కు చెందిన మహ్మద్ మొయుదీన్ అనే అతను తనతో పాటు 47 కొండచిలువలు, రెండు బల్లులను సైతం అక్రమంగా భారత్‌కు తీసుకువచ్చాడు. రెగ్యులర్ విధుల్లో భాగంగా తనిఖీ చేసిన విమానాశ్రయ అధికారులు బంగారమో, నగదో కాకుండా కొండ చిలువలుండటాన్ని చూసి హతాశులయ్యారు. వాటిల్లో వివిధ జాతులకు చెందినవి ఉన్నట్లు గుర్తించారు. రంధ్రాలు కలిగిన పెట్టెల్లో వాటిని ఉంచి ఇక్కడకు తీసుకువచ్చాడు. విషయం తెలిసి పోలసులు, ఫారెస్ట్ అధికారులు అక్కడికి చేరుకున్నారు. వాటిని మలేసియా పంపించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.



# కేబినెట్ భేటీ.. కీలక నిర్ణయాలు

హైదరాబాద్, జూలై 31 (తెలుగుప్రభ) రాబోయేది ఎన్నికల సీజన్. గెలుపే లక్ష్యంగా అన్ని పార్టీలూ కసరత్తు చేస్తున్నాయి. అధికార పక్షాన్ని ఇరుకున పెట్టడమే లక్ష్యంగా విపక్షాలు వ్యూహరచన చేస్తుంటే.. సర్కారు మాత్రం సంక్షేమ పథకాల అమల్లో దూకుడు పెంచుతూ ముందుకు సాగిపోతోంది. ఇలాంటి క్రమంలో సోమవారం జరిగే కేబినెట్ భేటీపై సర్వత్రా చర్చ జరిగింది. మధ్యాహ్నం 2.30 అనంతరం కేబినెట్ భేటీ అయింది. కీలక అంశాలపై సీరియస్‌గా చర్చించింది.

**పెండింగ్ పనుల పూర్తి**

అభివృద్ధి పనుల్లో దూకుడు పెంచాలని, పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ప్రధానంగా వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి, సత్వర సహాయక చర్యలు ముమ్మరం చేయాలని సంకల్పించారు. తక్షణ సాయంగా వెయ్యి కోట్లు విడుదల చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. అలాగే,

**రైతులకు మేలు చేసేలా**

రైతులకు మేలు చేసేలా పలు అంశాలపై చర్చ జరిగింది. రుణమాఫీపై ప్రకటన కూడా వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై కేబినెట్ దృష్టి సారించింది. వీటితో పాటు, పీఆర్సీతో పాటు.. డీఏలు, సీపీఎస్, ఆర్టీసీ ఉద్యోగులకు జీతాల పెంపు, ఉద్యోగుల బదిలీలు వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిసింది. మొత్తంగా 50కి పైగా వివిధ అంశాలపై కేబినెట్‌లో చర్చ జరిగింది.

**వరద బాధితుల కోసం..**

వర్షాలు, వరదలు, మరణాలు, ఆస్తి నష్టం, పంట నష్టంపై ప్రధానంగా చర్చించారు. ఆగస్ట్ 3 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా చర్చించారు. గవర్నర్ తమిళిసై వెనక్కి పంపిన బిల్లులపై న్యాయ సలహాలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది.

**మెట్రో విస్తరణ**

మెట్రోరైలు మార్గం విస్తరణ, పాతబస్తీతో పెండింగ్‌లో ఉన్న పనులకు కూడా త్వరలో శంకుస్థాపన చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. అంతేకాకుండా వరంగల్ ఎయిర్‌పోర్టు, బుద్వేల్‌లోని 200 ఎకరాల ప్రభుత్వ భూముల విక్రయం తదితర అంశాలపై భేటీలో చర్చకు వచ్చినట్లు తెలిసింది.

## వరద నిధులు కేటాయించండి..

### సీఎస్ వద్దకు కాంగ్రెస్ కార్పొరేటర్లు

**హైదరాబాద్, జూలై 31 (తెలుగుప్రభ)**

'నగరంలో కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలలో వరద, బురద సమస్యలు ఏర్పడ్డాయి. నాలాలు పొంగడంతో రహదారులన్నీ కొట్టుకుపోయాయి. మిగిలిన చోట్లా గుంతలు పడ్డాయి. ప్రజల సాధారణ జీవనం పై కూడా ప్రభావం పడింది. వీటి నుంచి బయట పడేందుకు నిధులు కేటాయించండి' అని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి ని నగర కాంగ్రెస్ కార్పొరేటర్లు కోరారు. సోమవారం కార్పొరేటర్లు మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి , ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, విజయారెడ్డి , శిరీష సోమశేఖర్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గం ఏ, బీ బ్లాక్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, మందముల పరమేశ్వర్ రెడ్డి , సీఎస్ శాంతి కుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. నగరంలో కేవలం లోతట్టు ప్రాంతాలలోనే కాకుండా మిగతా ప్రాంతాలలోనూ వర్షంతో సమస్యలు తలెత్తాయన్నారు. కాలనీలలోనే కాకుండా ప్రధాన రహదారులు సైతం డ్యామేజ్ అయ్యాయన్నారు. దీంతో నగరంలో ప్రజారవాణాకు ఇబ్బంది గా మారిందని సీఎస్ దృష్టికి తీసుకెళ్లారు. సీఎస్ శాంతి కుమారి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## కారుతో యువతి బీభత్సం

### ఫిలింనగర్‌లో కలకలం



హైదరాబాద్, జూలై 31 (తెలుగుప్రభ)

హైదరాబాద్ ఫిలింనగర్‌లో కారు బీభత్సం సృష్టించింది. ఎలక్ట్రికల్ బెంజ్ కారులో మహిళ ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ.. ఎలక్ట్రికల్ పోల్, చెట్టును ఢీకొట్టింది. అయితే ప్రమాద సమయంలో ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో పెను ప్రమాదం తప్పింది. కారు వేగానికి రెండు టైర్లు విడిపోయాయి. కారును అక్కడే వదిలేసి యువతి పారిపోయింది. అయితే.. ఆమె మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆమె ఎవరో వివరాల కోసం ఆరా తీస్తున్నారు.

## నేను నామినేషన్ వేయలేదు

### ఎంపీ బ్రిజ్ భూషణ్



**న్యూఢిల్లీ, జూలై 31 (తెలుగుప్రభ)**

మహిళా రెజ్లర్ల నుంచి లైంగిక నేరారోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ బ్రిజ్ భూషణ్ కీలక నిర్ణయం ప్రకటించారు. ఈసారి రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికల్లో పాల్గొనడం లేదని ప్రకటించారు. ఎన్నికల కోసం నామినేషన్ వేయలేదన్నారు. తన ఫ్యామిలీ సభ్యులు కూడా ఎవరూ పోటీపడడం లేదన్నారు. రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్ష ఎన్నికల నామినేషన్ ఫైలింగ్‌కు సోమవారమే (ఈరోజు) ఆఖరి తేది. బీజేపీ అధిష్ఠానం ఆదేశాలతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

## భర్తపై 'మొక్క'వోని ప్రేమ

**వికారాబాద్, జూలై 31 (తెలుగుప్రభ)**

సామాజిక మాధ్యమాల్లో ఓ ఆసక్తికర విషయం వైరల్ అవుతోంది. భర్తను పోగొట్టుకున్న మహిళ ఆయన జ్ఞాపకాలను మొక్కలో చూసుకుంటూ ఎంత అపురూపంగా కాపాడుకుంటోంది. వికారాబాద్ జిల్లా తాండూరు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి భర్త కోట్రిక వెంకటయ్య భౌతికంగా దూరమైనా ఆయనపై 'మొక్క'వోని ప్రేమ చాటుతున్నారు. 2016 జూలై 29న వెంకటయ్య పుట్టిన రోజు సందర్భంగా ఆయనతో కలిసి తాండూరు పట్టణంలోని తాము నివసిస్తున్న ఇంటి ముందు ఆమె ఓ మొక్క నాటారు. వెంకటయ్య అనారోగ్యం పాలై 2017 ఏప్రిల్ 5న మరణించారు. తన భర్త బర్త్‌డే సందర్భంగా నాటిన మొక్కకు ఏటా కుటుంబ సభ్యులతో కలిసి పుట్టిన రోజు వేడుక ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆరు నెలల క్రితం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తప్పనిసరి పరిస్థితుల్లో చెట్టును జేసీబీ సహాయంతో వేర్ల నుంచి పెకిలింపజేశారు. దాన్ని తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో నాటారు. ఈసారి ఆ చెట్టుకే జన్మదిన వేడుకలు నిర్వహించి అన్నదానం చేశారు.

